



# చీకటి

రచన: తుర్లపాటి కృష్ణమూర్తి

చీకటి చూస్తుండగానే నల్లటి ప్రకృతితెరలు నన్నావరించి, ఆశ్చర్యంలోముంచివేశాయి. కళ్ళు నులుముకున్నాను.

అక్కయ్య చెపుతూనేవుంది ఎంతో దూరం వెళ్లవద్దని. సాయంత్రం ఆహ్లాదంగా వుంది. షికారుకు వెళుతూ, వెంట కళ్ళజోడు కూడా ఎందుకులే అనుకుని బయలుదేరాను.

అసలే చూపు ఆనదు—దానికితోడుగా ఈ చీకటి వంతపాడింది. ఏంచేయాలో తోచ లేదు. ఆకాశంలోకి చూశాను, మసకమసగ్గా తెల్లటిరెక్కలుగల పక్షులేవో దూరంగా కన్పించాయి. నల్లగా, ఆకృతిమాత్రంగా కన్పిస్తున్న ఆ ప్రకృతిని చూస్తూ ఆలోచింపసాగాను ఇంటికి ఎట్లా పోవడమని. వళ్లు ఝల్లుమని హృదయాన్ని భయం ఆక్రమించింది. నేను వంటరివాడను దొంగలంటే భయంలేదు కాని, ఏ విషజంతువైనా....

గుండె గుబుక్కుమంది నడవసాగాను. నా ప్రక్కనుంచి ఏదో రాసుకుంటూ పోయింది ఎదురుగ్గా. బెదురు యెక్కువైంది, ఎడమకన్ను అదిరింది. తొట్రుపడి రాతిని తన్ని బోర్లగిలా పడిపోయాను. నరాలు కూరుకుపోయినట్లున్న నా మెదడు రాలి పోయిందేమో అనుకున్నా ఇంతలోకే....ఎవరో నాకు చేయూత నిచ్చారు. లేచి నిల్చున్నాను.

చల్లనిచెయ్యి....లావుపాటిగాజులు గలగల మనగానే స్త్రీ అనుకున్నాను. చేతివేళ్లు సున్నితంగా వున్నాయి. ఆ తెల్లటి మొహంలోని వెలుతురు చీకట్నిచీలుస్తూ నా కళ్ళను తాకింది.

ఆమె నవ్వి "పడ్డారా...." పడిన నన్ను లేవనెత్తి, పైగా 'పడ్డారా' అని అడుగుతోంది!! ఏం సమాధానమివ్వాలి ?

"అబ్బే లేదు! వళ్ళు కొంచెం తూలింది అంతే!"

ఆమె కిలకిలా నవ్వింది.

నేనుకూడా నవ్వేశాను. ఆమె అడిగింది 'ఎక్కడకు వెళ్తార'ని.

"ఫాక్టరీ స్టాఫ్ క్వార్టర్సు"

ఆమె వెళ్లిపోతున్నట్లుగా శబ్దం అయ్యింది. కాళ్లఅందెలు ఘణఘణా మ్రోగుతున్నాయి. ఆ శబ్దంకూడా కొంచెంసేపట్లో మాయమవుతుంది—ఇక అక్కడనుంచి కదల్లేకపోతాను. గట్టిగా 'అమ్మాయ్' అని అరిచాను.

అమ్మాయి ఆగినట్లు, అందెలసవ్వడి ఆగి పోయింది.

"నాకు చూపు సరిగా ఆనదు. నన్ను ఈ అడవి దాటించవూ?" అని గొంతెత్తి ప్రాధేయ పూర్వకంగా అడిగా.

రెండు నిమిషాల నిశ్శబ్దం. ఆ అమ్మాయి ఆలోచిస్తున్నట్లుంది. ఏం సమాధానమిస్తుందో నని ఆశగా నిరీక్షించాను.

"ఇంకొంచెం సేపట్లో చంద్రుడు వచ్చేస్తాడుగా—"

"నాకు అప్పుడుకూడా కన్పించదు. కాలు జారి నేను ఏ లోయలోనో పడిపోతే ఆ పాపం నీది కాదూ!—"

"అయితే, తొందరగా నడవాలి. మానాన్న నాకోసం సంతనుంచి బట్టలుతెస్తాడు" అంటూ నాదగ్గరకు వచ్చింది.

ఆనాడు ఆమె అట్లా ధైర్యంచేసి వుండక పోతే, ఆ రాత్రంతా నేను అక్కడే జాగరణం చేసేవాడ్ని.

ఆమె ఐదారడుగులువేసి ఆగింది 'రారేం'

"నాకు కన్పించదుగా దారి"

అమ్మాయి నాచెయ్యి తాకింది. గట్టిగా పట్టుకున్నాను ఆమె చేతిని.

"పద" అన్నాను.

ఆమె నడవటం ప్రారంభించింది. ఆమె చల్లనిచెయ్యి నా చేతిలో. ఆమె చల్లదనం వెన్నను మించింది. ఆమె హృదయం వెన్న లాటిది. వెన్న కృష్ణుడికి విందు. కృష్ణుడికి రాధికలను కలుసుకోడానికి ప్రశాంత ఏకాంత వాతావరణం అలవాటు. ఆ అలవాటుకు చీకటి తోడ్పాటు !!

చీకటి విచ్చుకుంది. చెట్లురాసుకుని, నిప్పు యేర్పడింది అల్లంతదూరాన. ఎండుటాకులు చప్పుడుచేస్తు కాల్తున్నాయి. మంటకూడా మా వైపుకు పరిగెత్తుకొస్తోంది. ఆ అమ్మాయి మొహం ఆ కాంతిలో స్పష్టంగా కన్పించింది.

కళ్ళుచెదిరాయి నాకు. ఆమెలేదు క్షణంలో మాయమైంది. ఆమెకోసం వెతికాను. దూరముగా గుట్టలవద్ద ఆమె ఆకృతి కన్పించింది. 'పరిగెట్టుకురండి' అని ఆమె చెయ్యివూపుతూ పిలిచింది. నేను పరిగెత్తి 'నన్ను వదిలేసి వచ్చేశావా?'

"మరి మీరు ఆ నిప్పునుచూస్తూ నిల్చుంటే నేనేం చెయ్యను?" తిరిగి నడక సాగించాము.

"ఎందుకలా పరిగెత్తావ్"

"నిప్పు అదంటే నాకు భయం"

"చాలాదూరంలో వుండగానే నువ్వు పారి పోయి వచ్చావ్"

"అవును! ఆ నిప్పుల్లోంచి తప్పించుకోవడానికి పాములూ, జెర్రులూ పారిపోతూ, మన దగ్గరకు రావచ్చు. అందుకనే, వాటిని మనం తప్పించుకోడానికట్లా పారిపోయివచ్చాము."

గుట్టలు దాటగానే వెలుతురు నశించి, పెనుచీకటి ఆవరించింది. తిరిగి నాలో ఏవేవో ఆలోచనలు. ఎవరీ అమ్మాయి? నన్ను ఆ నిశీధిని దాటించడానికి వచ్చింది. అందమైన అమ్మాయి—ఏకాంతము.

"నీ పేరు?" అని అడిగాను.

"అయ్యో! పట్నందొరలకు నా పేరెందుకు? మీకు నా పేరుచెప్తే మాఅయ్యా నన్ను చెట్టుకు కట్టి బాత్తాడు తెలుసా ?"

"మరైతే, నిన్ను ఏమని పిలుస్తాడు?"

"లచ్చి అంటాడు. మా మామయ్యేమో సరదలు పిల్లా అంటాడు."

"అయితే, నేనేమని పిలిచేది?"

అమ్మాయి మాట్లాడలేదు. నేను ఆగి పోయాను దారి కనిపించక.

ఆ అమ్మాయి మలుపుతిరిగిందో ఏమో గజ్జెలునవ్వడి దూరమైపోతోంది. నేను పిలిచాను వెనక్కువచ్చి అడిగింది 'రారేం' అని.

నేను ఆమెచేతిని పట్టుకున్నాను. నవ్వి అన్నానిలా: "ఎన్నిసార్లు చెప్పను! నాకు కన్పించదని" "నేనుకూడా నిన్ను లచ్చి అని పిలుస్తాను."

ఆమె ఎందుకో గట్టిగా నవ్వి "దొరా! అదేం మీరు పెద్దోరా—చిన్నోరా?"

"చిన్నవాడినే! బృందావనంలో గోపికలతో సరసాలాడిన కృష్ణుడివయస్సు నాది" అంటూ మరింత గట్టిగా నొక్కాను ఆమెచేతిని. ఆమె విడిపించుకోడానికి ప్రయత్నిస్తున్నట్లుంది.

"అయితే—మా అయ్య పిలిచినట్లు పిలుస్తారా? ఛా...."

"పోనీ—రాణీ అంటాను"

"అంటే—"

ఆమె పూర్తిగా అమాయకురాలని తెలుసుకున్నాను. ఆమెకు అందంతోపాటు, అమాయకత్వంకూడా సమపాళ్లలో వుందనుకున్నాను.

రాణీ అంటే ఏమిటో, ఎట్లా తెలియజెప్పాలో తెలియక ఇలా తప్పించుకున్నాను. "ఏమో! నాకూ తెలియదు అదొక పేరు."

"రాణీ....రాణీ" తనలో తాను ఎన్నిసార్లో అనుకుంది.

"బాగానేవుంది వినటానికి. మా మామకు దీనిసంగతి చెప్పి, రాణీ అని పిలవమంటా!"

ఆమెకు మరింత దగ్గరిసా జరిగి నడుస్తున్నాను. అప్పుడప్పుడు ఆమెవీపు నాకు తగుల్తోంది; ఆమె ముందుకు నడుస్తుంది, నన్ను తప్పించుకోడాని కన్నట్లుగా.

రాతిని తన్ని ముందుకు తూలిపోయాను.

ఆమె భుజాల్ని పట్టుకుని పడకుండా ఆగాను.

ఆమె ముందుకుపరిగెట్టినంత పనిచేసింది. వెంటనే నా హృదయంలో ఏదో ఘోష. నీ చదువూ సంస్కారం ఏమైపోయాయని దబాయించి ప్రశ్నిస్తోంది ఆత్మ. నీకు సహాయం చేస్తున్న ఓ అమాయకపుప్రాణికి నీవు యిచ్చే ప్రతిఫలం యిదేనా అని దీనంగా ఆక్రోశించింది ఆత్మ. ఎన్నడూ ఏ పాపమూ చెయ్యని నువ్వు ఇప్పుడు క్షణికానికీ జారిపోయి, నాకు కూడా ఆ పాపాన్ని ఆపాదిస్తావా అని విలపించింది. నేను సిగ్గుపడి ఆగిపోయాను.

ఆమె ముందుకువచ్చి, నాకు చెయ్యిఅందించింది. నేను కళ్లుదించుకున్నాను. ఈసారి ఆమెను అంటుకోడానికే నాకెంతో సిగ్గువేసింది. అయినా, తప్పదు.

ఆమె లాక్కుపోతోంది యాంత్రికంగా నడుస్తున్నాను. అంత చెప్పిన నా ఆత్మ వెనుకంజ వేస్తోంది. బలహీనత ఆత్మ నాక్రమించింది. వాంఛ జయించబోతోంది.

"దొరా! మీదే ఊరు—"

"మద్రాసు"

"ఇక్కడకెందుకొచ్చారు?"

"ఈ అడవులూ, కొండలూ, పూలచెట్లూ నీలాంటి అందమైన అమ్మాయిలూ–అన్నిట్నీ చూట్టానికి."

"చూసి—"

"చూసి....చూసి, నా కిష్టమైన వస్తువులు మీసంతలో దొరికితే తీసుకెళదామని. ఇక్కడ వస్తువులు అన్నీ ఖరీదైనవి."

"మరి, ఎలా తీసుకువెళ్తారు ? అంత ఖరీదువి—"

"డబ్బుతో కొని పట్టుకువెళ్తాను"

"అమాయకులైన అమ్మాయిల్నా—"

"ఊఁ వీలుంటే నిన్నుకూడా"

ఆమె పకపకా నవ్వింది. 'పెట్టెల్లోపెట్టి పట్టుకువెళతారా"

"రాణీ! అదుగో—చంద్రుడు"

నల్లని మబ్బుల్ని చీల్చుకుంటూ బైట పడ్డాడు చంద్రుడు. చంద్రకాంతి విరజిమ్ముతుంది. తన కిరణాలలో చాతనయినంత చల్లదనాన్ని మిళితపరచి ప్రయోగిస్తున్నాడు.

అమ్మాయికి అలా వెన్నెట్లో తిరగడం అలవాటుకాదు కామోసు, బిగదీసుకున్నట్లుంది ఆమె శరీరం. చేత్తో మొహం రుద్దుకుంటోంది.

తర్వాత, అడిగింధిలా: 'నేను అందంగా వున్నానా?'

"కాదని ఎవరనగలరు ? నీ కంటిలోని వెలుగు చంద్రకిరణాలకన్న మెరుగు నీ మొహంలోని కాంతి చంద్రునికే ఓ భ్రాంతి"

తన శరీరాన్ని ఓసారి పరిశీలనగా చూసుకొని వళ్లంతా తడుముకుంది. ఆమె అందాన్ని తనివితీరా కళ్ళతోనే త్రాగేశాను.

నాకళ్లలోకి చూసి మధురంగా నవ్వింది. ఆమె వళ్ళు తప్పించి మరింకేమీ నాకు కన్పించలేదు.

నేను ముందుకు నడిచాను. ఆమె వెనక్కు నడుస్తోంది.

చేతులు జాపినట్లనిపించింది. తడుముకుని పట్టుకున్నాను ఆ చీకట్లో. ఆ అమ్మాయి ఓ పెద్దచెట్టునీడలోకి తీసుకెళ్ళింది.

నేను ఆ అమ్మాయి కెదురుగా నిల్చుని వున్నాను.

ఆమె కళ్ళలోని ఆవేశం తగ్గిపోతోంది. మొహంలోని వెలుగు మాయమౌతోంది. ఆమె ఏదో ఆలోచిస్తూ, నిశ్శబ్దంగా వుండిపోయింది.

నేను గబుక్కున ఆమెను కావిలించుకుని ముద్దుపెట్టుకున్నా విదిలించుకుంది. "తప్పు దొరా" అంది. పిశాచం ఫకఫకానవ్వినట్లుంది.

అమ్మాయి కళ్ళుమూసుకుంది. ఉచ్ఛ్వాస నిశ్వాలు పెరిగాయి. ఆమె చేతులు తాచు పాములా నన్ను పెనవేశాయి.

"రాణీ" అన్నాను. 'పోదామా' అంది.

"పోదామా" అని తిరిగి ప్రశ్నించాను లేచి నిల్చుంది. బయలుదేరాము.

"నిజం చెప్పు! నాతో వచ్చేస్తావా?"

"ఆ! మా కొండలమ్మతోడు వట్టుపెట్టనా"

"వద్దులే! మరి మీ అయ్య వద్దంటే—"

"నేను లెక్కచేయను మీతో వచ్చేస్తా పెళ్లి చేసుకుందాం"

"మీ అయ్యకు తెలిస్తే—"

"ఏం చేస్తాడు? మా అమ్మాయిని పెళ్ళాడండని మిమ్మల్నడుగుతాడు అంతేగా? మీరు కాదంటేనూ — నన్ను ఆలా చీల్చిపారేస్తారు"

"ఎలాగూ"

'మీరు కాదనరుగా'

"ఎలా అంటాను? నీలాంటి చందమామను వదులుకుంటానా?"

కొంతదూరం నడిచాక అన్నాను : 'మరి రేపు ఏడింటికల్లా ఇక్కడకొచ్చేయ్. మీఅయ్య వప్పుకుంటే సరేసరి. లేకపోతే రేపే మన ప్రయాణం'

ఆమె నన్ను గాఢంగా కౌగలించుకుని ముద్దుపెట్టుకుంది. నా పెదిమలు ఈసారి భగ్గున మండినట్లయ్యాయి ! !

మరోగంటకు అడివిదాటాము. నన్నొదిలి దూరంగా ఓ గుట్టమీద నిల్చొనివుంది రాణి. 'రేపిదేవేళకు' అంటుంది. ఊరుదగ్గర్లోనే వుంది.

వెనక్కు తిరిగాను, యింటికి పోదామని. గుండ్రటిరాతిమీద కాలువేసి, ఓ ఎత్తయిన ప్రదేశాన్నుంచి దొర్లిపోయాను అంతే.

మైకం కమ్మి స్పృహ తప్పింది.

కళ్ళుతెరిచి చూచేప్పటికి మంచంమీద పడుకునివున్నాను యింట్లో. మంచంప్రక్కన అక్కయ్య నిల్చునివుంది.

"ఎట్లా పడిపోయావ్‌రా!"

నాతలకున్న 'కట్టు' తడిమిచూసుకున్నాను. ఏమీ బోధపడలేదు. అయోమయంగా చూశాను అక్కయ్యకేసి.

"ఊరు పొలిమేరల్లోకి వచ్చినాక, ఎత్తునించి పడిపోయావుట కూలీలెవరో తీసుకొచ్చారు"

"అది కాదక్కయ్యా! అసలెలా పడిపోయానని"

"ఏమో! నాకెలా తెలుస్తుంది — అదేగా నేను నిన్ను అడుగుతూంట"

నేను నిండుగా నవ్వాను. నా నవ్వులో అక్కయ్యకేదో మార్పు కన్పించినట్లుంది. నన్ను పరిశీలనగా చూసింది. నా బుగ్గమీద గోటిగంటు ఆమెకళ్లపడింది. కంగారుగా అడిగింది 'ఏమిట్రా ఇది' అని సాగదీసుకుంటూ.

నా బుగ్గను తడిమిచూస్తున్నాను. మంచం మీంచిలేచి, అద్దంలో చూసుకున్నాను. నా పెదిమలపై చిరునవ్వు అక్కయ్యను మరింత సందిగ్ధావస్థలో ముంచింది.

"అక్కయ్యా! నా చేతిలోని చాక్‌లెట్ కోసం ఒకకోతి నామీదకు ఎగబడింది. దాన్ని వదిలించుకోడానికి నాకు గంటసేపు పట్టింది. దాని గోళ్లే గుచ్చుకునివుంటాయి" అని అబద్ధమాడాను.

"నేను చెప్పలేదురా! ఈ ప్రదేశం నీకు క్రొత్తగదా! అడవుల్లోకి వెళ్ళొద్దని అంటే విన్నావా? ఇంకా నయం—పులి గ్రట్రా ఏమీ ఎదురుపడలేదు—"

"అవునక్కయ్యా! నేను నిజంగా ఎంతో అదృష్టవంతుడ్ని!"

మర్నాడు సాయంత్రం ఆరింటికల్లా బయల్దేరాను. కళ్ళకు అద్దాలున్నాయి. చలికోటు నిండుగా కప్పివుంది. మెడమీదుగా ఉలెన్ మఫ్లర్ వెచ్చగావుంది. చేతిలోని టార్చిలైటు దివ్యంగా ప్రకాశిస్తోంది.

ఒక గంటసేపు తదేకదృష్టితో నడిచాను. ఆ చెట్లతోపు చేరుకున్నాను. గడియారంలోకి చూశాను ఏడయింది.

ఈరోజైనా తొందరగా యిల్లు చేరుకోమని అక్కయ్య మరీ మరీ చెప్పింది, బావ కూడా హెచ్చరించాడు.

అటూ ఇటూ పచార్లుచేస్తున్నాను.

రాణీ వస్తుందా! ఆమె అయ్య వప్పుకున్నాడా? ఇంతలో....

"ఒరేయ్ — రాజూ .... రాజూ...." అని ఎవరో గట్టిగా పిలుస్తున్నారు. బావగొంతు ఇక్కడకెందుకొచ్చాడో నామీదకుటార్చివెలుగు ప్రసరించింది,

"ఒరేయ్! ఇక్కడున్నావెందుకు" దగ్గర కొచ్చాడు.

ఏం చెప్పను?

నాగుండె గతుక్కుమంది. బావ నాతో ఉన్నప్పుడు రాణీ ఇక్కడకు వస్తే, అక్కయ్యతో బావ చెప్తే, అక్కయ్య ఏమనుకుంటుంది? అబద్ధం చెప్పివుండకపోతే ఫర్వాలేదు రాణీ నాకు కాబోయే నిజమైన రాణీ అని ఆమెతోచెప్పివుంటే బాగుండేది. తప్పకుండా ఆమెఅంగీకరించేది.

"ఏరా? మాట్లాడవేం?" బావ గ్రుచ్చిగ్రుచ్చి అడుగుతున్నాడు. నెమ్మదిగా పెదవులపైకి నవ్వు తెప్పించుకున్నాను.

"ఏంలేదు బావా! ఏంతోచకఇట్లావచ్చాను"

"మన ఫాక్టరీ స్థలాలలో నీకు తోచదా? ఆ తోచడానికి ఇంతదూరం రావాలా? నీకీప్రదేశం సంగతి బొత్తిగా తెలియదు!"

"అయితే బావా! నువ్వెందుకొచ్చినట్లు?"

"నీకోసమే! మీ అక్కయ్యగారు మిమ్మల్ని వెదికి పట్టుకురమ్మని ఆజ్ఞాపించగా, ఆజ్ఞాబద్ధుండనై యిటుల వచ్చినాడ.

తెలిసిందా? నీకు తెలియదు కనుక చెపుతున్నాను, వినుకో. మరెప్పుడూ ఈ గుట్టలూ చెట్లూవున్న ప్రదేశానికి రాకు పద.

"ఎందుచేత?"

"ఇక్కడ దెయ్యాలున్నాయి, పిశాచాలు తిరుగుతాయి పట్టపగలే"

"ఎలా తెలుసు?"

"చూసినవారు చెప్పారు"

"ఎక్కడచూసినట్లు చెప్పారు?"

"ఇక్కడే! ఏం రిసెర్చిచేస్తావా?"

"ఒరేయ్! నిన్నా మొన్నా ఇక్కడకొచ్చావ్ గదా! నీకేమీ కన్పించలా!"

"ఊహుం బావా! టార్చిలైటు తీసుకొచ్చావే నీకు కూడా కనిపించవాకళ్ళు? లేక భయం కొదీ తీసుకొచావా?

"నాకు భయం ఏమిట్రా బుజ్జినాన్నా! నువ్వు భయపడ్తావనే మీ అక్కయ్య నన్ను పంపించింది! చీకట్లో దెయ్యాలలాగాచూడటం నాకు చాతగాదు తెలిసిందా!" బావ ఫారెస్టు ఆఫీసరు.

"బావా! దెయ్యాలు చీకట్లో తిరగ్గలవా"

"ఆ! ఒకటేమిటి అనేక రూపాలతో ఎలా పడితే అలాతిరుగుతుంటాయి, గాలిలో ఎగురుతాయి, మండుతాయి, నీళ్ళుకారిపోతాయి. కామినిపిశాచాల కీ ప్రదేశం పెట్టింది పేరు.

"నిజంగా కామినీపిశాచాలున్నాయా"

"చూడాలని వుందా"

"ఎట్లా వుంటాయి"

"ముసిలివి, పడుచువి ఏడుస్తూ, నవ్వుతూ రకరకాలువి, పడుచుదెయ్యాలు అన్నిపనులు చేస్తాయి తెల్లగా వెడల్పైన పలువరుసతో నన్నని పాములాటి శరీరంతో, తియ్యానికబుర్లు చెపుతూ, కమ్మనికలలు కనిపిస్తూ—"

నా కడుపు దేవినట్లు ఫీలయ్యాను. కళ్ళు తిరిగాయి రాణీ ఎవరూ?

భయంతో ఉక్కిరిబిక్కిరయ్యాను. ఏదో లోకంలోకివెళ్ళి పోతున్నట్లుంది. ఈ లోకం నిద్రపోయింది. ఎక్కడికో పరిగెత్తుకెళ్లాను. అక్కడ అంతా భయంకరమైన మనుష్యులే! ఒక జంతువు నావైపుగావచ్చి, తన మొసలినోటిని బార తెరిచి మ్రింగబోయింది. వేడివాతావరణం నిప్పుల్లో దొర్లుతున్నాను. తలలోకి ప్రవహించింది బావా! అగ్నిపర్వతాలు గుప్పున మండిపోయాయి. అక్కడివేడి భరించలేక వెనక్కు పారిపోయి వచ్చాను చల్లని వాతావరణంలోకి.

'అమ్మా' అని మూలుగుతూ, ప్రక్కకు దొర్లాను. ఎవరో నా నుదురును తడిగుడ్డతో తడిపారు. ఉడుకులాం కామోసు. కొద్దిగా కళ్ళుతెరిచాను.

అక్కయ్య ప్రక్కనే కూర్చునివుంది.

చుట్టూచూశాను బావ ఆ గదిగోడనానుకుని నిల్చునివున్నాడు.

"జడుసుకున్నావా" అనడిగారు ఇద్దరూ.

నేను మాట్లాడలేదు లేచికూర్చున్నాను. చిరునవ్వు నవ్వపోయాను. అక్కయ్య నావీపు నిమిరింది బావ ఫకఫకా నవ్వాడు.

"ఒసేయ్! నేనేదో సరదాకి అంటే, మీ బుల్లోడు కాస్తా బెదిరి మూర్ఛపోయాడు. చూశావా! మీవాడి ధైర్యసాహసాలు"

నిరాంతపోయాను.

"బావా! నిజమేనా"

"అవున్రా! వట్టినే నిన్ను బెదరగొడదామని అన్నాను"

నాలో వెయ్యి లైటుహౌస్లు దారిజూపాయి! మంచంమీంచి గప్పున గెంతాను. మరో నిమిషంలో ఇంట్లోంచిపరిగెట్టాను. బావఅక్కయ్య నిర్ఘాంతపోయి చూస్తునిల్చున్నారు!

పరిగెట్టాను ఎంతో దూరం చెట్లతోపులో కెళ్ళాను.

ఆ చెట్టుక్రింద నిర్మానుష్యంగావుంది దగ్గరకువెళ్ళా టార్చిలైటుకాంతిలో అనుకోకుండా ఆప్రదేశాన్ని పరిశీలనగా చూశాను.

ఎవరో అక్కడ అంతకుక్రితం వచ్చిపోయినట్లు గుర్తులు కనిపించాయి. గడియారం చూసుకున్నాను రాత్రి రెండు గంటలైంది.

తిరిగి క్రిందకు వంగాను.

ఎర్రటి గాజుముక్కలు రాణివి ఆగాజులు! క్రితంరాత్రి నేను, ఆమె చేతులకుండగా చూశాను చంద్రకాంతిలో.

మరింత పరిశీలనగాచూశాను. అనుమానం ఎక్కువైంది, ఆత్రుత, ఆవేశం, ఉద్వేగం, వికలత్వం నన్నావరించాయి.

రక్తపుబొట్లు!

పది పండ్రెండు గజాలదూరంలో రక్తసిక్తమైన గొడ్డలి—

'రాణీ' అంటూ ఓ వెర్రికేకపెట్టింది నా మనస్సు.

బావ నన్ను పట్టుకున్నాడు. అక్కయ్య కూడా వుంది.

అక్కడే కూలపడిపోయాను చీకట్లో.

మర్నాడుదయమే ప్రయాణమైనాను, అక్కయ్య వుండమని బ్రతిమాలింది. ఆమె కళ్ళలో నీళ్లు సుడులుతిరగడం నేను చూడకపోలేదు.

"అక్కయ్యా! మీకు ట్రాన్స్ఫర్ అయితే తప్పకుండా వస్తాను" అంటూ రైలెక్కాను. రోజుల్లా రైలు అడవులగుండా పాములా పరిగెడుతోంది కిటికీలోంచి చూస్తున్న నాకు దూరంగా, చీకట్లో ఏదో ఆకాశం కన్పించినట్లు నవ్వింది. పలువరుస తళుక్కుమంది. కళ్ళంబడి నీళ్ళుకారాయి! రాణీ ఏడుస్తోంది!!

నా ఊహ రైలుకూతలో కలిసిపోయింది.

రాణీ చీకట్లో పరిచయమై, అమాయకంగా ఆ చీకటికే బలయిపోయింది—చీకటికి బలి!!

★

# సౌందర్య పిపాసకులు

రచన: తాళ్ళూరి జయదేవ్

చిన్ననాటి స్నేహితుడు 'రవి' వద్దనుండి ఉత్తరం వచ్చింది. ఉత్తరంతోబాటు రవి శుభలేఖ కూడ వచ్చింది. చాలాకాలం అయింది మిత్రుణ్ణికలసికొని. కాస్త మంచిచెడ్డా మాట్లాడుకున్నట్లవుతుంది పుణ్యం పురుషార్థ మరెందుకైనాగాని పెళ్లిభోజనాలకు ఒకవారం రోజులు ముందుగా తిష్టవేయుట మంచిది.

ఒకనాటి సాయంకాలం నేను నామిత్రుడు నూతన వరుడు బంధువులను అందుకునేందుకు బస్సుస్టాండువద్దకు వెళ్లాము. బందరు బస్సు రావటం ఆలస్యమయింది. మేమిద్దరం ఒకచెట్టునీడన నిలబడి పిచ్చాపాటి మాట్లాడుకొంటున్నాము. ఇంతలోకి మా దగ్గరసా ఒక బస్సు నిదానంగా కదలిపోతున్న కారణంగా మా సంభాషణకు అంతరాయం కలిగింది. మాకళ్ళు బస్సులోవున్న జనసమూహాన్ని నిశితంగా చూస్తున్నాయి. ఉన్నట్టుండి నా కళ్ళు బస్సులోనుండి చెయ్యి బయటకు జారవేసిన ఒక విలాసినిపై పడింది. ఆమెచెయ్యి నిగనిగ మెరుస్తూ చెయ్యివేస్తే జారుతుందా అన్నంత నునుపుగనున్నది. చేతికి మరింత వన్నెతెచ్చే గాజులు. "అబ్బ! ఆ చేతిని ఒకసారి నా చేతితో స్పృశించి ఎంత నున్నగా ఉందో చూస్తారా!" మా వాడితో అంటూ ముందు వెనుక ఆలోచించకుండా కార్యాచరణలోపెట్టనున్న సమయంలో కొంపతీసి అంతపని చెయ్యకు అంటూ నన్ను దూరంగా లాక్కువెళ్ళాడు వ్యధితహృదయంతో.

"సరిగా నీకు కలిగినట్లుగానే నాకొక దుర్బుద్ధికలిగింది. ఆ సంఘటన ఈ జన్మకు మరువలేను" అంటూ తన పూర్వానుభవాన్ని చెప్పసాగాడు

"అవి నేను గుంటూరులో చదువుకునే రోజులు. ఒకనాటి సాయంత్రం నేను ఒక మిత్రుడు మస్తాన్ ఉరుసు ఉత్సవాలు చూట్టానికి వెళ్ళుతున్నాము. జనసమ్మర్ధం విరివిగానున్నది. భుజాలమీదచేతులువేసికొని సర్దాగా మాట్లాడుకుంటూ ముందుకిసాగిపోతున్నాము. ఉత్సవాలకు వచ్చేవాళ్ళలో రకరకాల జనం ఉంటారు. ఎటువంటివారైన ఆ పరిసరాలకు పరిస్థితులకు కొంత ప్రచలితులౌతారు. విటులు విలాసినులు వీరి చూపులనుండిదాటుకుంటూ పోతున్నాము. మా కెదురుగుండా ఒక కన్యపడుచు నవవయ్యారంగా నడుస్తూ బెదురు చూపులుచూస్తూ మా వైపుకేసివస్తుంది. ఆమె లేతబుగ్గలు మిలమిల నాలో విపరీతబుద్ధి పుట్టించింది. 'ఆమె బుగ్గమీద చిటికెవేస్తే?' అని మనస్సులోకి రావటం ఆమె మా దరిదాపుల్లోకి రావటం నేను చిటికెవేసి మా వాడి భుజంమీదనుండి నా చెయ్యి తీసివేయటం అంతా యాంత్రికంగా జరిగిపోయింది. తత్ఫలితంగా నా మిత్రుడిచెంప 'ఫెళ్ళు' మన్న శబ్దానికి తెప్పరిల్లుకున్నాను. ఆమె మావాడిని కొట్టి "నీకు అక్కలు, చెల్లెళ్ళు .... లేరు'' అంటూ బోరున యేడుస్తుంటే మా వాడికి అంతా అయోమయంగా వుంది. జనంపోగవుతున్నారు ఒక్కొక్కరే. "ఏమిటి నీవు వాగేది పిచ్చా యేమన్నా?" అంటున్న నా మిత్రుణ్ణి అచ్చట చేరిన అందరూ ఆమెద్వారా వృత్తాంతము తెలిసికొని మా వాణ్ని చివాట్లుపెడుతుంటే నా గొంతులో పచ్చివెలక్కాయ అడ్డంపడినంతపని జరిగింది. అసలు సంగతి చెప్పదామనుకున్నా. కాని ఎటు మాట్లాడినా ప్రమాదమే. ఆ తరువాత యేదైతే జరిగిందో అదంతా చెప్పటంకంటే సూక్ష్మంగా చెపుతా. అంతా కలిసి మా వాడిని మాలిష్ చేశారు. పోలీసుల విజిల్ చప్పుడు విని సమూహం చెదిరిపోయింది. వెంటనే మావాడిని రిక్షాలో వేసికొని రూమ్‌కు తీసికొనివెళ్ళి గాయాలకు చికిత్సచేశాను. వాణ్ని చూస్తుంటే జాలి, నా మీద నాకు అసహ్యంవేసింది. అది మొదలుకొని వాణ్ని చూసినప్పుడు నా కా సంఘటన సినీమారీలులా తిరిగి వ్యధగా వుంటుంది అని వాడు చెపుతుంటే మధ్యలో నే నందుకొని "నీవు ఇప్పుడు నన్ను వారించకపోయినట్లయితే ఇవ్వాళ అంత రభసా జరిగేదేమో! ఎవరో కవి అన్నమాటలు గుర్తుకు వస్తున్నాయి" అంది అందనిదే ఆనందమని. అందాన్ని చూడు కాని చెడగొట్టకు. హద్దులు మించితే పరిస్థితి పైవిధంగా జరగటంలో విపరీతం లేదేమో!  ★